తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
03 ఆగస్టు 2025
పేజీలు : 10





## ఒక్కొక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

**జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**

**తూప్రాన్ ఆగస్టు 2 (జనం సాక్షి):** ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతోతో సమానం అని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. తూప్రాన్ డివిజన్ కేందంలో ఏర్పాటు చేసిన సీసీ సిసి కెమెరా కమాండ్ కంట్రోల్‌ను శనివారం ప్రారంభించిన సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావ్, అడిషనల్ ఎస్పీ మహేందర్ మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ ఒక్కొక్క సీసీ కెమరా వంద మంది పోలీసులతో సమానం అని సీసీ కెమెరాల ప్రాధాన్యత గూర్చి వివరించారు. తూప్రాన్ లో సీసీ కెమెరాల అమరికలు చాలా అద్భుతంగా ఉన్నాయని ఇంత చక్కగా సీసీలను తీర్చిదిద్దిన తూప్రాన్ డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్ లను జిల్లా ఎస్పీ ప్రశంసించారు.. ఈమధ్య కాలంలో చాలా మట్టుకు క్రైమ్ పెరిగిపోవడం జరిగింది. దీనికీ అనుకూలంగా సీసీ లు ఉపయోగ పడతాయని అర్ధరాత్రుల్లో అపరిచిత వ్యక్తులు ఏ ప్రాంతములో తిరిగిన సీసీలో రికార్డు అవుతాయని దీని బట్టి చొరికి పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం సులువుగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మహేందర్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సిఐ రంగా కృష్ణ, ఎస్ఐ శివా నందం, తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు..

◆ అక్రమ రవాణాను పట్టించుకోని అధికారులు ◆ ఆగిపోతున్న ఇంటి నిర్మాణాలు ఇబ్బందుల్లో లబ్ధిదారులు

**చేర్యాల ఆగష్టు 02 (జనంసాక్షి):**
ఇందిరమ్మ ఇండ్ల పథకం అధికారుల నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారులకు ఇసుక భారంగా మారుతూ ఇబ్బందులు పడుతూ నిర్మాణం ముందుకు సాగడంలేదు ముఖ్యంగా అధికారుల పట్టింపులేమితో గృహ నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోవాల్సిన పరిస్థితి వస్తోంది. చేర్యాల మండలంలో స్థానికంగా ఇసుక లభించే గ్రామాలు వేచరేణి, ఆకునూరు, తాడురు,చిట్యాల, దొమ్మట ఉన్నాయి. కానీ ప్రభుత్వ అధికారులు లబ్ధిదారులకు ఇసుక లభించే గ్రామల పేర్లు రాసి టోకెన్లు ఇచ్చి పంపిన స్థానిక గ్రామస్తులు ఇసుక రావాణ చేయనియ్యకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేటుగా ఇసుక అక్రమ రవాణా భారీగా జరుగుతోంది.

గత కొద్ది రోజుల ముందు ఒక ట్రాక్టర్ ఇసుకకు ఐదు నుండి రూ.6000 తీసుకునే వారు ప్రస్తుతం ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.9000 వరకూ తీసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తుండడం, ప్రభుత్వం కేటాయించిన ఇసుక లభించకపోవడంతో ఇందిరమ్మ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దీనిపై స్థానిక తహసిల్దార్ దిలీప్ నాయక్‌ను వివరణ కోరగా ఈ విషయంపై తమకు గత రెండు రోజుల నుండి లబ్ధిదారుల నుండి సమాచారం వచ్చిందని, దీనికి పరిష్కారంగా ప్రభుత్వం కేటాయించిన ఇసుక స్థలాలలో గ్రామస్తులను ఒప్పించి లేదా ప్రభుత్వ అధికారులను నియమించి ఇసుక రవాణా చేసే విధంగా ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని తెలిపారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**భూత్పూర్,ఆగస్టు 2 (జనం సాక్షి):**
పట్టణంలోని సారిక టౌన్ షిప్ వద్ద ఏర్పాటు చేసిన భూత్పూర్ మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బి.సి.సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, నిత్యావసర సరుకుల ను పరిశీలించారు. మెనూ బోర్డును పరిశీలించి, మెనూకు అనుగుణంగా భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యవేక్షణ అధికారి ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

## ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్

**అచ్చంపేట ఆగస్టు 2 (జనం సాక్షి)**
అచ్చంపేట మండల పరిధిలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలం లోని అక్కారం గ్రామపంచాయతీ కార్యదర్శి ముక్తాలాల్, అంకిరోని పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కల్పన ఇద్దరు డిఎస్ఆర్ అటెండెన్స్‌ను ఫేక్‌గా రిజిస్ట్రేషన్ చేసినందుకు ఆ ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రైవేట్ ఆసుపత్రిలో నిబంధనలు పాటించాలి

◆ ఇంచార్జ్ జిల్లా వైద్య అధికా రి డాక్టర్ కె నాగ నిర్మల
◆ క్లినిక్ డయాగ్నొస్టిక్‌కు రూ. 10 వేల జరిమానా



**సంగారెడ్డి టౌన్ ఆగస్టు 2 (జనం సాక్షి)**
ప్రవేట్ ఆసుపత్రిలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి పాటించాలని పాటించని యెడల తగు చర్యలు తప్పవని ఇంచార్జ్ జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె నాగ నిర్మల హెచ్చరించా రు. శనివారం నాడు సంగారెడ్డి పట్టణంలోని ప్రవేట్ ఆసుపత్రిలో ఇన్చార్జి జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె నాగలక్ష్మి విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా సాహితి క్లినిక్ డయాగ్నొస్టిక్, నడుపుతున్నందుకు పదివేల రూపాయలు జరిమానా విధించారు. తప్పనిసరిగా అనుమ తులు తీసుకోవాలని లేని యడల చర్యలు తప్పవని హెచ్చరించారు. గోకుల్ వెంకటేశ్వర, సన్‌రైస్, వినోద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లకు ప్రభుత్వ నిబంధనలు పాటిం చడం లేదని హాస్పిటల్‌లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగ నిర్మల మాట్లాడుతూ ప్రవేట్ హాస్పిటల్‌లో ప్రభుత్వానిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పాటించని ఎడల తగిన చర్యలు ఉంటాయని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజలకు నాన్య మైన వైద్య సేవలు అందించాలని, ఏదైనా ప్రైవేట్ వైద్య సంస్త ప్రభుత్వ నియమావళిని పాటించకపోతే వారిపై క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ ఆక్ట్ 2010 ప్రకారము కటిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులను తనికీ చేయడానికి (7) టీం లను ఏర్పాటు చేశామని అన్నారు. డాక్టర్ శశాంక్ దేశ్పాండే, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎండు గంజాయి పట్టివేత

**సంగారెడ్డి, ఆగస్టు 2 (జనం సాక్షి) :**
సంగారెడ్డి జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారుల తనిఖీలలో అక్రమంగా రవాణా చేస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్ర ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ సిబ్బంది పటాన్చెరు పాత టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ కెపిహెచ్బి కి చెందిన సాయికుమార్, కాశీ రాహుల్, గుండ్ల మహేష్ గౌడ్ ద్విచక్ర వాహనంపై అక్రమంగా ఎండు గంజాయి రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 2.129 కేజీల ఎండు గంజాయి, స్కూటీ, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులో ఇద్దరు పరారీలో ఉండగా ఒకరిని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.



**పట్టుబడ్డ గోవా లిక్కర్..**
సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకల్ టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో గోవా నుంచి తరలిస్తున్న వివిధ బ్రాండ్లకు సంబంధించిన 6.250 లీటర్ల సుంకము చెల్లించని మద్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ స్టేషన్ కు తరలించారు. దాడిలలో ఎక్సైజ్ ఎస్సై శంకర్ ఎస్సైలు హనుమంతు, అనుదీప్, దిలీప్, ఈసీ అంజి రెడ్డి, అరుణజ్యోతి పాల్గొన్నారు.



## కేతకి ఆలయంలో అఖండ శివ పంచాక్షరీ మంత్ర జపం

- భారీ సంఖ్యలో హాజరుకానున్న భక్తులు

**సంగారెడ్డి, ఆగస్టు 02 (జనం సాక్షి)**



జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గల కేతకి ఈ సంగమేశ్వర ఆలయంలో అఖండ శివ పంచాక్షరి మంత్ర జపం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, ఆలయ అర్చకులు నాగరాజు స్వామి, శివ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణమాసం పురస్కరించు కొని ఆగస్టు 4 సోమవారం కేతకి సంగమేశ్వర ఆలయంలో సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు నిర్విరామంగా అఖండ శివ పంచాక్షరి మంత్ర జపం కొనసాగుతుందని తెలిపారు. ఉదయం 06.30 నుండి 08.30, 08.30-10.30, 10.30-12.30,12.30-2.30, 2.30-04.30, 4.30-6.30 ఈ సమయం భక్తులు ఎంచుకోవాలని తెలిపారు. బృందంగా వచ్చే వారు ముందుగా సమాచారం ఇవ్వాలని కోరారు. లోక కళ్యాణార్థం జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేతకి సంగమేశ్వర స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఉదయం 9 గం నుండి అన్న ప్రసాదం ఉంటుందని, సాయంత్రం అల్పాహార ప్రసాదం ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు.

## నిరుపేద వధువు వివాహానికి బియ్యం అందజేత



**నంగునూరు, ఆగస్టు 2 (జనం సాక్షి)**
సిద్ధిపేట జిల్లా నంగునూరుకు చెందిన బోనగిరి భాగ్యలక్ష్మి కూతురు బోనగిరి అంజలి వివాహానికి నంగునూరు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీమతి చౌడుచర్ల మమత జయపాల్ రెడ్డి 50 కిలోల బియ్యం అందించారు. భాగ్యలక్ష్మి ఆర్థిక పరిస్థితులను నంగునూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి, శాసనసభ్యుడు తన్నీరు హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన హరీశ్ రావు ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ చౌడుచర్ల మమత జయపాల్ రెడ్డి శనివారం నిరుపేద వధువుకు పెళ్లికి 50 కిలోల బియ్యం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు దేవులపల్లి కనకయ్య, కొండిల్ల రాజు,జంగిటి నరసింహులు, జంగిటి ఐలయ్య, జంగిటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక సాంద్రత పత్తి సాగుతో ఎక్కువ దిగుబడి

- వ్యవసాయ అధికారి రాజేష్

**అల్లాదుర్గం ఆగస్ట్ 2 జనం సాక్షి :** తేలికపాటి నేలల్లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి వేసుకోవడం వలన ఎక్కువ దిగుబడి వస్తుందని వ్యసాయ అధికారి రాజేష్ అన్నారు. మండలంలోని చేవెళ్ల గ్రామంలో అధిక సాంద్రత పత్తి చేనును ఆయన సందర్శించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి రాజేష్ కుమార్ మాట్లాడుతూ తేలికపాటినేలలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి వేసుకోవడం వలన సాధారణ పద్ధతి కంటే అధిక సాంద్రత పద్ధతిలో ఎక్కువ దిగుబడి వస్తుందని, అదేవిధంగా రైతులు పత్తి పంటలో పసుపు రంగు జిగురు అట్టలను ఎకరాకు పది నుంచి 12 చొప్పున పెట్టుకోవడం వలన రసం పిల్చే పురుగులు పసుపు రంగు ఆకర్షణికి జిగురు అట్టలపైన అతుక్కుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతు బగిలిరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రాజు ,నవీన్ పాల్గొన్నారు.



# కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన హరీష్ రావు





**నంగునూరు,ఆగస్టు 2, (జనం సాక్షి)**
నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులు చనిపోవడంతో కార్యకర్తల కుటుంబాలను మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అధైర్య పడవద్దని మనో ధైర్యాన్ని అందించారు. సిద్ధన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కత్తుల శంకర్ రెడ్డి, కత్తుల సంజీవరెడ్డి, కత్తుల సత్తి రెడ్డి తల్లి కత్తుల మల్లవ్వ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న హరీశ్ రావు వారి కుటుంబాన్ని పరామర్శించారు. వీరి తండ్రి కత్తుల వీరారెడ్డిని ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంక్షాపూర్ గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బూసిరెడ్డి రుక్మా రెడ్డి తల్లి బూసిరెడ్డి రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అంక్షాపూర్ గ్రామానికి వెళ్లి వారి రుక్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. మగ్దుంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బండి సాయిలు తల్లి మృతి చెందారు. దీంతో మగ్దుంపూర్ గ్రామాన్ని సందర్శించి సాయిలు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్, నాయకులు జాప శ్రీకాంత రెడ్డి, రాగుల సారయ్య, ఎడ్ల సోమిరెడ్డి, దువ్వల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలి



**బెజ్జంకి,ఆగస్టు02,(జనం సాక్షి):** మండల కేంద్రంలో వ్యవసాయ అవసరాలకు సరిపడా యూరియా లభించక రైతులకు ఇబ్బందులు కలుగుతున్నా యని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి వ్యవసాయ అవసరాలకు సరిపడా డిమాండ్‌కు తగినట్టుగా యూరియాను రైతులకు అందించాలని మానవ హక్కుల కమిషన్ మండల అధ్యక్షుడు ఎలుకంటి తిరుపతిరెడ్డి అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరిపడా యూరియాను అందించాలని రైతులు బారులు తీరకుండా చూడా లని రైతులు కోరుకుంటున్నారని అన్నారు. రైతుల తిప్పారపు మహేష్,రాములు,దొనే అనిల్, దుమాల మహేష్, సంఘ నరేష్, రావుల మహేష్ రైతులు పాల్గొన్నారు.

## ధర్నా కరపత్రం ఆవిష్కరణ



**పాపన్నపేట, ఆగస్టు 02 (జనంసాక్షి) :**
పాఠశాల విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5న మెదక్‌లో తల పెట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కుర్తివాడలో శనివారం ధర్నా కరపత్రం ఆవిష్కరించి, టీఎస్ యూటీ ఎఫ్, టిపిటీఎఫ్ నాయకులు మాట్లాడారు. గత హామీ ప్రకారం 5571 పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి, పదోన్నతుల ద్వారా నింపాలన్నారు. సర్వీస్ రూల్ రూపొందించి రెగ్యులర్ ఎంఈఓ లను నియమించాలన్నారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఏలను,పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. జిఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలని,సొంత జిల్లాలకు పంపాలని జెడ్పి జిపిఎఫ్, టీఎస్ జిఎల్ఐ, సరెండర్ సెలవులు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయలకు విరమణ రోజునే రావలసిన అన్ని బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల భూషణం,జిల్లా కార్యదర్శి నాచారం శేఖర్,జిల్లా నాయకులు కె.వి.ఆర్ నాయుడు, మల్లేశం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిమెంటు దాత లింగాల వెంకటేష్‌కి సన్మానం



**బెజ్జంకి, ఆగస్టు02 (జనం సాక్షి):**
మండల కేంద్రంలో శనివారం దేవులపల్లి శ్రీనివాస్, లింగాల సాయిచరణ్ ఆధ్వర్యంలో ఇందిరామ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ అందిస్తు పేదలకు సేవ చేస్తున్న లింగాల వెంకటేష్‌ను గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఘనంగా శాలువాలతో స్నేహితులు సన్మానించారు. 15 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 50 సిమెంట్ బస్తాలు ఇవ్వడం గొప్ప విషయమని ఆయన సేవలు మరింత విస్తృతపరచాలని స్నేహితులు ఆకాంక్షించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, బొల్లం శ్రీధర్,ఎలుక దేవయ్య,లింగాల శ్రీనివాస్,బర్ల శ్రీధర్,కొరివి తిరుపతి,బిగుళ్ళ మోహన్,రాము,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలి దూరంగా ఉండే చదువుపై శ్రద్ధ వహించాలి

### తూప్రాన్ ఎస్సై 2 జ్యోతి



**తూప్రాన్ ఆగస్టు 2(జనం సాక్షి):** విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలని తూప్రాన్ ఎస్ఐ2 జ్యోతి తెలిపారు. మెదక్ జిల్లా పోలీసు కళా బృందం. షీ టీంతో తూప్రాన్ గీతా స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సందర్భంగా కళాకారుడు సురేందర్ తన మాట, పాటలతో విద్యార్థులను చైతన్య పరిచారు. విద్యార్థుల్లో యుక్త వయసులో వచ్చే వివిధ మార్పులను తెలియజేస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలని తెలియజేశారు. తూప్రాన్ సబ్ ఇన్స్పెక్టర్ - 2 జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనా లకు దూరంగా ఉండాలని సూచించారు. షీ టీం సభ్యురాలు గంగమణి మాట్లాడుతూ విద్యార్థినులు తాత్కాలిక ఆకర్షణలకులోను కాకుండా ఉండాలన్నారు. అమ్మాయిలకు ఏదైనా సమస్య ఉంటే షి టీం నంబరు ను సంప్రది ంచాలని కోరారు. మెదక్ సిటీ సబ్ ఇన్స్పెక్టర్ రామచంద్ర నాయక్, గీతా స్కూల్ కరస్పాం డెంట్ రామాంజనేయులు, చైర్ పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్,వైస్ ప్రిన్సి పాల్ రాజేశ్వర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందించిన మంత్రి వాకిటి



**మక్తల్, ఆగస్టు 02 (జనంసాక్షి)**
హైదరాబాద్ హక్కింపేట్ పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపికలో మక్తల్ సాయి జ్యోతి హైస్కూల్ విద్యార్థి బి నిశాంత్ పాల్గొని అసమాన క్రీడ నైపుణ్యతను ప్రదర్శించి హైదరాబాద్ హకీంపేట క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశం పొందుటకు ఎంపిక కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సన్మానించి అభినందించినట్లు కరస్పాండెంట్ వెంకటయ్య చైర్మన్ నర్సింలు పిటి రమేష్ కుమార్ తెలిపారు. బి నిశాంత్ తల్లిదండ్రులు అంజప్ప, సావిత్రమ్మ మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన వారు. కాగా కూలి పని చేస్తూ తమ కుమారుని చదివిస్తున్నారని అక్కింపేట క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం దొరకడంతో ఆనందాన్ని వ్యక్తపరుస్తూ బి నిశాంత్‌కు నెల రోజులపాటు క్రీడా పాఠశాల కొరకు తొమ్మిది క్రీడాంశాలలో శిక్షణ ఇచ్చిన పిడి రమేష్ కుమార్‌కు పాఠశాల యాజమాన్యానికి తండ్రి అంజప్ప కృతజ్ఞతలు తెలియజేశారు. సాయి జ్యోతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థి హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల కరస్పాండెంట్ వెంకటయ్య చైర్మన్ నర్సింలు ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, వాయిస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ రెడ్డి, కవిత, పిటి రమేష్ కుమార్ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరి మహేశ్వరి, సుజాత, రమాదేవి, సంగీత, రియాజ్, సంతోష్ విద్యార్థులు శాలువతో సన్మానించి అభినందించారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి



**వనపర్తి, ఆగస్టు 2 (జనంసాక్షి):** మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారు వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డుకు చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ధర్మన్న అనారోగ్యంతో ఉన్న విషయాన్ని తెలుసుకొని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే వార్డుకు చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి భాగ్యరాజు వాళ్ళ అమ్మ కళావతమ్మకి మోకాలు కీలు మార్పిడి సర్జరీ అయినందున మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరార్శించారు. 29 వ వార్డుకు చెందిన సయ్యద్ జమీల్ తల్లి అనారోగ్యంతో ఉన్న సమాచారాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి వారి నివాసానికి వెళ్లి కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరార్శించారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, ప్రేమ్ నాథ్ రెడ్డి,ఉంగ్లం తిరుమల్, నీల స్వామి, చిట్యాల రాము, యువ నాయకులు ఆలిం, నందిమల్ల సుబ్బు,రాహుల్ ముదసర్,సంతోష్,ముని కుమార్, సతీష్,శివ గౌడు,లక్ష్మణ్ గౌడ్, కడుకుంట్ల వెంకట్ సాగర్, వార్డు పెద్దలు నాయకులు ఉన్నారు.

## రిజర్వేషన్లు అమలు చేయలేకే కాంగ్రెస్ డ్రామాలు


**- ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకుడు కెంచె శ్రీనివాసులు**

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతం బిసి రిజర్వేషన్లు ఇవ్వలేక కాంగ్రెస్ పార్టీ సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ డ్రామా ఆడుతున్నారని ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకుడు కెంచె శ్రీనివాసులు ఒక ప్రకటనలో విమర్శిం చారు. కర్ణాటకలో మాదిరిగా తెలంగాణలోనూ బిసి లని మోసం చేస్తున్న దని అన్నారు. మత పరమైన రిజర్వేషన్లను జోడించి అసెంబ్లీ తీర్మానం, ఆర్డినెన్సు నాటకాలు ఆడుతూ సిఎం కాంగ్రెస్ పార్టీ బిజెపిపై బట్టకాల్చి వేసే కుట్ర చేస్తున్నదని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే బిసిల్లో ముస్లింలను తొలగించి తీర్మానం చేయాల్సిందని, లేదా స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజ్యాంగం ప్రకారం 73,74 సవరణల ప్రకారం అనుకున్న రిజర్వేషన్లు అమలు చేయవచ్చని అన్నారు. ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని అన్నారు. ఆర్డినెన్సు జారీ చేయడంతో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు.కానీ రిజర్వేషన్లు అమలు చేసే ఇష్టం లేక బిసిలను మోసం చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ కుటిల నీతినీ ప్రజలు గుర్తిస్తున్నారనీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయంలో భక్తుల సందడి



**మల్దకల్ ఆగస్టు 2 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సత్య చంద్రారెడ్డి మాట్లాడు తూ పవిత్రమైన శ్రావణమాసంలో శనివారం ప్రత్యేకంగా భక్తులు పాల్గొని పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈసారి కూడా పెద్ద ఎత్తున భక్తులు దేవాలయానికి వస్తున్నారని తెలిపారు. ఆలయ అర్చకులు మధుసూదనాచారి మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయాన్ని ప్రతి ఒక్కరూ దర్శించుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులకు రాయచూరు పట్టణానికి చెందిన దాసరయ్య గోపాల్ రెడ్డి దంపతులు అన్నదానం ఏర్పాటు చేయగా ఈవో పూజలు నిర్వహించి దాతలను ఘనంగా సన్మానించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదనా చారి, రవి, చంద్రశేఖరరావు, వాల్మీకి పూజారులు దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల సృజనాత్మకత అద్భుతం

**రాజాపూర్, ఆగస్టు 2(జనంసాక్షి) :**



రక్షాబంధన్ అనగానే అన్నాచెల్లెళ్ల పండుగగా అందరికి తెలిసిందే. పూర్వం దూదికి రంగులు అద్ది,బట్టతో రాఖీలు చేసేవారని చరిత్ర తెలుపుతుంది. మారుతున్న కాలానికనుగుణంగా రకరకాల రాఖీలు బంగారం, వెండి తో కూడా తయారు చేస్తున్నారు. అన్నా చెల్లెళ్ల ప్రేమానురాగాలు కూడా స్టేటస్‌ను బట్టి ఉంటాయి అనే విధంగా వ్యాపారస్తులు మారుస్తున్నారు. ప్రజలు మనం కట్టె రాఖీ విలువ చూడకుండా, ప్రేమానురాగాలు మాత్రమే చూడాలి. ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న అరాచకాలు చూస్తూ మంచి ఎలా ఉంటది అనే అనుమానం కలిగే పరిస్థితితులు ఏర్పడ్డాయి. అమ్మయిలపై అగాయిత్యాలు ఆగాలంటే విద్యార్థి దశ నుండే మార్పు రావాలి. శిశుమందిరం విద్యాలయాల్లో రక్షాబంధన్ కార్యాక్రమం నిర్వహిస్తారు. కొన్ని పాఠశాలల్లో కూడా నిర్వహిస్తున్నారు. దీని వలన విద్యార్థుల్లో సోదరభావం కలుగుతుంది. చిన్నప్పటి నుండే అమ్మాయిల పట్ల అక్కచెల్లెళ్ళ అనుబంధం అబ్బాయిలకు కలుగుతుంది. పాఠశాలలో చిన్నారులకు రాఖీలు తయరుచేసే పోటీలు నిర్వహించడం వల్ల వారి సృజనాత్మకత బయటపడుతుంది. రాఖీ పండుగ విశిష్టత తెలుస్తోంది. ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన పాఠశాలలకు హర్షాభినందనాలు ప్రజలు తెలుపుతున్నారు.



## సామూహిక భవనం కొరకు వికలాంగుల వినతి

**- తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా కమిటీ**

**చేర్యాల ఆగస్టు 02 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లాకు చెందిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల వికలాంగులు ఏకమై వారికి చేర్యాలలో కమ్యూనిటీ భవనం కావాలని కోరుతూ శనివారం తహసిల్దార్ దిలీప్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరగొండ మల్లేశం, తుమ్మలపల్లి అనిల్ ఆధ్వర్యంలో జరగగా తెలంగాణ వికలాంగుల వేదిక వ్యవస్థాపకుడు మేకల సమ్మయ్య మాట్లాడుతూ.. నాలుగు మండలాల వికలాంగులం ప్రతినెల తమ సాధక బాధకాల గురించి అలాగే ఇతర విషయాల గురించి చేర్యాల పరిధిలో సమావేశాలు నిర్వహించుకుంటున్నామన్నారు. మా అభివృద్ధికి మొదటి మెట్టు అలాగే మా సమావేశాలకు ప్రధానంగా శాశ్వత కమ్యూనిటీ భవనం ఉండాలని,అందుకు చేర్యాల పరిధిలో ప్రభుత్వ స్థలం కావాలని ప్రభుత్వ స్థలాన్ని చూసి ఇవ్వమని ఎమ్మార్వో ను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు పర్వతం మల్లయ్య, కమిటీ సభ్యులు ఆలేటి రాజు, తాండ్ర సత్తయ్య, భూమయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు..



**చేర్యాల ఆగష్టు 02 (జనంసాక్షి) :**
చేర్యాల మండలంలోని వీరన్న పేట గ్రామ 2వ అంగన్వాడి సెంటర్లో అంగన్వాడీ టీచర్ తేలు అరుణ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూపర్వైజర్ నాగమణి, వీరన్నపేట తాజా మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి,పంచాయత్ కార్యదర్శి మధు హాజరై మాట్లాడుతూ.. తల్లిపాలతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పుట్టిన శిశువుకు తప్పనిసరిగా ముర్రపాలు గంటలోపు పట్టాలని అని, తల్లులు పిల్లలకు కచ్చితంగా రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు పిల్లలకు అందించాలని తెలిపారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వక పోవడం వల్ల నీళ్ల విరోచనాలు, నిమోనియా, శ్వాసకోస జబ్బులతో అనారోగ్యానికి గురవుతారని, బాలింతలు, గర్భిణీలు తీసుకునే ఆహారంలో ఐరన్, కాలుష్యం పదార్థాలు ఉండేలా తినాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాలకు వచ్చి పౌష్టికమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం చేసారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం గీత, ఆశా వర్కర్లు, రజిత, భాగ్య, అంగన్వాడీ టీచర్లు అరుణ,శోభ, జానకి గర్భిణీ స్త్రీలు, అంగన్వాడి కమిటీ మెంబర్లు రాధిక, మానస, కళ్యాణి, శోభ గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదివితే లక్ష్యం నెరవేరతుంది

**- ఎస్ఐ బి సౌజన్య**

**బెజ్జంకి,ఆగస్టు02,(జనం సాక్షి):** మండలంలోని బేగంపేట గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్,సెయింట్ ఆంటోనీ హై స్కూల్‌లో సందర్శించి విద్యార్థిని విద్యార్థులకు క్రమశిక్షణతో చదివితే మీరు అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని ఎస్సై బి సౌజన్య దిశా నిర్దేశం చేశారు. ఉపాధ్యాయుల పట్ల గౌరవప్రదంగా, ఏకాగ్రతతో వారు చెప్పే మంచి లక్ష్యం దిశగా మీరు అడుగులు వేస్తే క్రమ శిక్షణతో చదివితే మీ లక్ష్యాలను నెరవేర్చుకోవచ్చని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని,తల్లిదండ్రులు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమాజానికి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఎస్ఐ బి.సౌజన్య అన్నారు. అనంతరం సీసీ కెమెరాలు ప్రాముఖ్యతను తెలియజేసి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో సీసీ కెమెరాలు బిగించుకోవాలని తన వంతు సహాయంగా 500 రూపాయలు జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఇన్చార్జికి అందించారు.





## ఉచిత కిడ్నీ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):**
లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణ్ పేట్ గీత మల్టి స్పెషాలిటి ఆధ్వర్యంలో శనివారం గీత మల్టి స్పెషాలిటి హాస్పిటల్ లో ఉచిత కిడ్నీ మూత్ర సంబదింత వ్యాధులపై నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో 110 మంది పాల్గొన్నారు. ప్రఖ్యత కిడ్నీ శస్త్రచికిత్స నిపుణులు వివేకానంద్ కట్టి పర్యవేక్షణలో చికిత్సలతో పాటు ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి గ్రస్తూలు ప్రోటీన్స్ ఎక్కువ తీసుకో రాదని ముఖ్యంగా ఆల్కహాల్ అలవాటు ఉన్నారు వెంటనే మానెయ్యాలని జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, అధిక బరువు తోపాటు షుగర్ బిపిని కంట్రోల్‌లో ఉంచుకోవాలని, నీళ్లు ఎక్కువ తాగాలని సూచించారు. అంతకు ముందు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ స్త్రీ వైద్య నిపుణురాలు గీత విశ్వనాధ్ వినాయక విగ్రహనికి ప్రత్యేకపూజలు నిర్వహించి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్, శస్త్ర చికిత్స నిపుణులు విశ్వనాథ్, కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రాధ, సదానంద్ చారి, ఆత్మరాం, ఏడికె శ్రీనివాస్, లాహెూటి బీంచందర్ గౌడ్, కన్న జగదీశ్, జనార్ధన్, డాక్టర్ థౌసిప్, రామకృష్ణ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు ప్రకటించాలి

**- కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి డిమాండ్**




**చేర్యాల ఆగష్టు 02 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో జనగామ జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా పేరు పెడతామని హామీ ఇచ్చి మరిచిందని, మొదటి అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేసి జనగామను పాపన్న జిల్లాగా ప్రకటించకుండా జాప్యం చేయడం ఎందుకనీ తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి నిలదీశారు. శనివారం తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలంలోని అర్జున్ పట్ల గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ఆగస్టు 2వ తేది బొలగాని పుల్లయ్య వర్ధంతి రోజు ప్రారంభమై, సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజు 18న ముగింపు చేస్తామని, ఈ యాత్రలో గీతా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు అనగొని నర్సింలు, సొసైటీ అధ్యక్షులు గొల్లపల్లి చంద్రమౌళి, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లపల్లి నర్సింలు,లింగం,శ్రీహరి,సురేష్,మహేష్, లింగాల బాలయ్య, బాల్ రాజు,తదితరులు పాల్గొన్నారు.

## పెద్దగొట్టిముక్ల శివాలయంలో ప్రత్యేక పూజలు

**- హాజరైన ఘన్ శ్యామ్ దంపతులు**



**శివ్వంపేట ఆగస్ట్ 2 జనంసాక్షి :**
శ్రావణమాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకొని శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల గ్రామ శివారులో స్వయంభూగా కొలువైన ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయానికి సోమవారం జంట నగరాలతోపాటు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో పాటు ఉమా సంగమేశ్వర స్వామి పునర్నిర్మాణ దాత అయిన గుజరాత్ రాష్ట్రానికి చెందిన ఘాన్ శ్యామ్ పటేల్ ధార్మిష్టా దంపతులు వారి కుటుంబ సభ్యులు, ఆలయ నిర్వాహకులు గోళీపల్లి కవిత హనుమంత్ రెడ్డి దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఆలయంలో ఉమా సంగమేశ్వరుడిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు చండిక ప్రసాద్ శర్మ, వినయ్ కుమార్ శర్మ ల ఆధ్వర్యంలో మొదటగా గణపతి గౌరీ పూజలు జరిపిన తర్వాత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వేద మంత్రోర్చ రనాలతో నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గోళీపల్లి కవిత హన్మంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సులోచన ధర్మారెడ్డి, ఆలయ నిర్మాణ దాత ఘన్ శ్యామ్ పటేల్ కుటుంబ సభ్యులు, నాయకులు మురళీ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవ్వాలి



**మక్తల్, ఆగస్టు 02 (జనంసాక్షి)**
మక్తల్ మండలం ప్రాథమికోన్నత పాఠశాల చిట్యాలలో జులై మాసానికి గాను 24 రోజుల పాఠశాల పని దినములు క్రమం తప్పకుండా 100% హాజరైన విద్యార్థిని విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సవిత అభినందించి బహుమతులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ఒకటవ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు క్రమం తప్పకుండా, క్రమశిక్షణగా పాఠశాలకు హాజరై తరగతి గదుల్లో బోధించే పాఠాలను విని అర్థం చేసుకొని మంచిగా చదువుకొని మీ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థుల హాజరు శాతం పెంచే ఉద్దేశంతో తన ఆలోచనను మాతో పంచుకొని ఆచరణలో పెట్టిన విధుర్ కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అకాడమిక్‌లో జులై నెల నుండి ఏప్రిల్ నెల వరకు ప్రతినెల ప్రతి తరగతి నుండి నెలవారీగా 100% హాజరైన విద్యార్థులను గుర్తించి ప్రతి నెల మొదటి తేదీన వారికి అభినందించి, బహుమతులను అందిస్తామని తెలిపారు. ఈ విధంగా అకాడమిక్‌లో 90% హాజరైన విద్యార్థులను గుర్తించి అకాడమిక్ ముగింపు నెల ఏప్రిల్‌లో వారికి ప్రత్యేక బహుమతిని అందించే కార్యక్రమం ఏర్పాటు చేస్తామని, కావున పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని క్రమం తప్పకుండా నెలవారీగా అకాడమీక్ చివరన ఇచ్చే బహుమతులను అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం విజయవంతం అవ్వాలి అంటే ఆయా తరగతి ఉపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జులై నెలకు గాను పాఠశాల నుండి మొత్తం 100% హాజరైన 34 మంది విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విదుర్ కుమార్, కనకాద్రి, అనిల్ కుమార్ రెడ్డి, వరలక్ష్మి జ్యోతిలు పాల్గొన్నారు.

## హరీష్ రావుపై ఆరోపణలు సిగ్గుచేటు

**- సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 2 ( జనం సాక్షి)**
మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుపై టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడారు. విలువలతో కూడిన రాజకీయం చేస్తున్న మాజీ మంత్రి హరీష్ రావుపై ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. హరీష్ రావు విలువలతో కూడిన రాజకీయాలు చేస్తారు తప్ప మీ లాగా చిల్లర రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని చూడరని మండిపడ్డారు. బనకచర్ల ప్రాజెక్ట్ ఇంకా ప్రారంభం కాక ముందే నిర్మాణం పూర్తయినట్టు బహిరంగం గా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ సాగునీటి రంగంపై కాంగ్రెస్ పార్టీకి అవగాహన శూన్యమని ఆయన అన్నారు. బనకచర్లతో గోదావరి నీటి విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదట చెప్పింది బీఆర్ఎస్ నాయకులు కాదా అని ప్రశ్నించారు. బనకచర్ల కోసమే మేడిగడ్డకి రిపేర్లు చేయకుండా నీళ్లు వదిలింది వాస్తవం కాదా అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మేడిగడ్డకు వెంటనే మరమ్మతులు చేయించాలని అన్నారు. అదీ చేతకాకపోతే కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు స్టార్ట్ చేసి రైతులకు నీళ్ళివ్వండి అని సూచించారు. రైతు బీమా ప్రీమియం కట్టకుండా మోసం, సన్న వడ్లకు బోనస్ అని చెప్పి మోసం చేసి ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తున్నారు మహేష్ కుమార్ గౌడ్‌ను ప్రశ్నించారు. అధికార పార్టీ పాదయాత్ర చేసినట్లు చరిత్రలో లేదు ప్రజల్లో మీకున్న వ్యతిరేకతను గ్రహించే ఈ పాదయాత్ర చేపట్టినట్టు తెలుస్తుందన్నారు.

## నేటి తరానికి క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

**- భవిత కళాశాలలో విద్యార్థులకు డాక్టర్ బ్రహ్మం చే మోటివేషన్ క్లాస్**



**సదాశివపేట ఆగస్ట్ 2(జనం సాక్షి)**
విద్యార్థులు భవిష్యత్తుపై ఒక లక్ష్యం ఏర్పరచుకొని ముందుకు సాగాలని కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజ్ అన్నారు. శనివారం సదాశివపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు మోటవేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని, విద్య నేర్పే గురువుల పట్ల గౌరవం కలిగి ఉండాలని తెలిపారు. విద్య ఎంత నేర్చుకుంటే అంత జ్ఞానం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రుల గొప్పతనాన్ని వివరించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ బాలరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాల్లో స్పష్టత విద్యార్థులకు ఉండాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవంగా మెలుగుతూ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని అన్నారు. కళాశాల డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, రాజు, భవిత కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గణితం బోధన బాగుండాలి : డిఈవో

**పాపన్నపేట, ఆగస్టు 02 ( జనంసాక్షి) :**
విద్యార్థులకు అర్థమయ్యే విధంగా గణిత బోధన ఉండాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. శనివారం కుర్తివాడ ఉన్నత పాఠశాలలో యూపీ లెవెల్ స్కూల్ గణిత కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించగా టేక్మాల్, పాపన్న పేట మండల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొ న్నారు. ఈసందర్భంగా డిఈవో విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులకు గణితశాస్త్రం ప్రత్యేక చొరవతో బోధన చేస్తే మిగతా సబ్జెక్టు లలో సైతం విద్యార్థులు ప్రతిభ చూపుతారని వ్యాఖ్యానించారు. గణితం సులభంగా అర్థమయ్యేలా బోధించడానికి వివిధ పద్ధతుల గూర్చి చర్చించారు. సమయ పాలన పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భవాని ప్రసాద్, వెంకటేశం, శివకుమార్,కిషన్,విక్రమ్ గౌడ్,ఆర్పీ లు బాలరాజు,పవన్,సిఆర్పీ దేవయ్య ఉన్నారు.



# విద్యాభివృద్ధికి కలిసి పని చేస్తాం

## ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి





**మిడ్జిల్ ఆగస్టు 2 (జనం సాక్షి)**
నియోజకవర్గ అభివృద్ధి కొరకు కలిసి పని చేస్తామని మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వస్పుల జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.27 లక్షలతో నిర్మించిన అధునాతన సైన్స్ ల్యాబ్, అదనపు తరగతి గదులను ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీకే అరుణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ విద్యా వసతులు మరింత బలపడేలా కేంద్రం అన్ని విధాలుగా మద్దతు ఇస్తోందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి విద్యాభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తాయన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువు ఒక గొప్ప సంపద లాంటిదని, విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం ముఖ్యమన్నారు.

అలాగే ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను అన్ని సదుపాయాలతో కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అభివృద్ధి చేయడం మా కర్తవ్యం అని పేర్కొన్నారు. ఈ పాఠశాలకు మా ఇద్దరి పార్టీలు వేరైనా మా సంకల్పం విద్యాభివృద్ధి చేయడమేనని స్పష్టం చేశారు. గత రెండు రోజుల క్రితం ఎంపీ అరుణ తో కలిసి జడ్చర్లకు బైపాస్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గట్కరిని కోరడం జరిగిందని అన్నారు. అలాగే ఉపాధ్యాయులు అడిగినట్లుగా పాఠశాలకి డైనింగ్ హాల్, వంట గదికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు అందరూ బాగా చదివి పదవ తరగతి లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి, స్థానిక ఎమ్మార్వో రాజు, ఎంపీడీవో గీతాంజలి, ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

**- భాజపా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**



**అమీన్పూర్, ఆగస్టు 2 (జనం సాక్షి)**
అమీన్పూర్ మున్సిపల్‌లో విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని భాజపా జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం భాజపా మండల పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ అమీన్పూర్ మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విలీన గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామనీ హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పటాన్చెరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

## 108 కృష్ణానది శుద్ధ జలాలతో బీచుపల్లిలో పూజలు

**మానవపాడు,ఆగస్టు 02 (జనం సాక్షి )**
మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో శనివారంఆంజనేయుస్వామీ దేవాలయంలో..ఉన్న ఆంజనేయ స్వామీ విగ్రహాని ప్రతి ఏట 50జతల ఎద్దుల కాడిలతో వర్షాలు బాగా కురవాలని 12కిలోమీటర్ల దూరంలో ఉన్న మారమునగాల గ్రామ సమీపాన ఉన్న కృష్ణానదికి తీసుకెళ్లి నదిలో ఆంజనేయ స్వామీ విగ్రహాని శుద్ధికరించి వర్షాలు బాగా కురువాలని ప్రత్యేకమైన పూజా కార్యక్రమాన్ని చేసుకొని మళ్ళీ తిరిగి కృష్ణానది శుద్ధ జలాలు 108 కడవలతో జల్లాపురం గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో శివలింగానికి కృష్ణానది శుద్ధ జలాలతో అభిషేకించడం జరిగింది. మరెన్నడు లేని ఊహించని విధముగా ఉత్సాహంగా మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూజార్లు అజయ్ నరేంద్ర, గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉరేసుకొని మహిళా ఆత్మహత్య



**మొగుడంపల్లి, ఆగష్టు 02(జనం సాక్షి ):**
వివాహం జరిగి ఏడాది కూడా నిండకముందే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మొగుడంపల్లి మండలంలోని విట్టు నాయక్ తండాలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం సోని అలియాస్ ఆశ (19) పొలంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. భార్యా, భర్తల మధ్య తగాదాలే ఆత్మహత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## రేషన్ కార్డులు పంపిణి చేసిన ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నాయకులు

**వీపనగండ్ల, ఆగస్టు 03 (జనం సాక్షి ) :** వీపనగండ్ల మండల కేంద్రంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు, గృహలక్ష్మి పత్రాలు, కళ్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం ప్రజా పాలన ప్రభుత్వం లో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. రేషన్ కార్డు జయసుధ కు,ఇంటి నిర్మాణగృహ లక్ష్మి పత్రం పద్మకు, లక్ష్మికి కళ్యాణ లక్ష్మి చెక్కు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వరలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్, ఎస్ రవీందర్ రెడ్డి, నారాయణరెడ్డి, బసవ రాజ్ గౌడ్, పాము రాజశేఖర్, వెంకట రాజయ్య, రఘు ఫోటో స్టూడియో,అఖిల్, చక్ర వెంకటేష్, డిజె శివ తదితరులు పాల్గొన్నారు.







## ప్రెజెంటేషన్ పాఠశాలలో ఘనంగా ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ

**- చేర్యాల ఎస్సై వేముల నవీన్**

**చేర్యాల ఆగష్టు 02 (జనంసాక్షి) :**
చేర్యాల మండలం గుంటూరుపల్లిలోని ప్రెజెంటేషన్ హైస్కూల్లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేర్యాల ఎస్సై వేముల నవీన్, చేర్యాల స్పోర్ట్స్ క్లబ్ ఇంచార్జి సునీల్, రెవెరెంట్ ఫాథర్ దిలీప్, ప్రెజెంటేషన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతీ, ప్రెజెంటేషన్ మనేజ్మెంట్ సిస్టర్ ధన్య, ప్రెజెంటేషన్ కిండర్ గార్డెన్ స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ జూలీ పాల్గొన్నారు. ఈ వేడుకలో విద్యార్థి నాయకులకు పదవులు,బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, సేవభావన పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసినట్టు పాఠశాల యాజమాన్యం తెలిపారు.

## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ**



**సదాశివపేట ఆగస్ట్ 2(జనం సాక్షి)**
అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని 17వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు గుండు రవి, లక్ష్మీ ప్రసన్న శంకర్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు హాజీ, షెజ్జీ భాయ్, వసీం దాదా, రఘు, తుకారం, మధు గౌడ్, యాదగిరి ,జావిద్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన అంబేద్కర్ భవన ఏర్పాటు కొరకు ఎమ్మెల్యేకు వినతిపత్రం



**మిడ్జీల్ ఆగస్టు 2 (జనం సాక్షి) :**
మిడ్జీల్ మండల కేంద్రంలో నూతన అంబేద్కర్ కళా భవన్ నిర్మాణం కొరకు అంబేద్కర్ సంఘం తరపున ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దేవయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, అంబే ద్కర్ సంఘం సీనియర్ నాయకులు మాజీ బి వెంకటయ్య, సంఘం సభ్యులు రమేష్, బాలు, సురేష్, స్థానిక మాజీ ఎంపీటీసీలు సంపత్ కుమార్, గౌస్, నాయకులు అశోక్ , నరసింహ పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాపాడాలి

## సిఐటియు రాష్ట్ర ఉపాధ్యాయ అక్షరాలు జయలక్ష్మి




**జడ్చర్ల, ఆగస్టు 2 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం తన విధి విధానాలను మార్చుకొని నాలుగు లేబర్ కోడులను రద్దు చేసి, కార్మిక చట్టాలను, కార్మికుల హక్కులను కాపాడాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. జయలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం జడ్చర్ల అంబేద్కర్ కళాభవన్‌లో రెండు రోజులపాటు జరిగే సీఐటీయూ జిల్లా శిక్షణ తరగతుల కార్యక్రమంలో మొదటి రోజు శనివారం శిక్షణ తరగతులకు హాజరైన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కార్మిక ఉద్యమ చరిత్ర, సిఐటియు విశిష్టత అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో కార్మికులు బానిసత్వంలోకి నెట్టబడి యాజమానులు చెప్పిందే విధంగా పని చేయాల్సిన పరిస్థితిని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తుందని, కార్మికులు సంఘాలను పెట్టుకునే స్వేచ్ఛను పూర్తిగా కోల్పోతున్నారని, కార్మికులకు వేతనాలు పని గంటలకు సంబంధం లేకుండా యాజమాన్యాలు ఎలా చెప్తే అలా పని చేసే విధంగా లేబర్ కోడులను అమలు చేస్తున్నారని, లేబర్ కోడులకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు చైతన్యమై పోరాటాలకు సిద్ధం కావాలని, కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లపై తమ వైఖరిని మార్చుకొని రద్దు చేయా లని అన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షులు దిప్లా నాయక్, జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సిఐటి జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, జిల్లా కోశాధికారి చంద్రకాంత్, రాజ్ కుమార్, తిరుమలయ్య, వసియా బేగం, కమరలి, తదితరులు పాల్గొన్నారు.

# మల్లెపల్లిలో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు



**చారకొండ, ఆగస్టు 2( జనంసాక్షి)** చారకొండ మండల పరిధిలోని మల్లెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో శంకర్ నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామపంచాయతీ ద్వారా పరిష్కరించు కోవాలని ఎంపీడీవో శంకర్ నాయక్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ప్రభుత్వ పాఠశాలను అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య మధ్యాహ్నాంను అందించ చాలని తెలిపారు. విద్యార్థులతో ముట్టు ముచ్చటించి స్కూల్లోని వివిధ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వైకుంఠధామం గ్రామ నర్సరీ పల్లె ప్రకృతి వనంను ఆయన సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి రవికుమార్, పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

# కడవేరుగు, ముస్త్యాల గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల ఇసుక బాధితుల అవస్థలు



**చేర్యాల ఆగస్టు 02 (జనంసాక్షి) :** కడవేరుగు, ముస్త్యాలతో పాటు వివిధ గ్రామాలకు ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి ఇసుక గురించి గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి టోకెన్ ఇచ్చిన ఇసుక కేటాయించిన గ్రామాల నుండి ఇసుక వేరే గ్రామానికి పంపమని చెపుతున్నారు. ఇసుక పంపక పోవడంతో ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడం కష్టతరంగా మారిందని గ్రామాలకు ఇసుక టోకెన్లు చూపిన విధంగా మంజూరు చేయాలని చేర్యాల తహసిల్దార్ దిలీప్ నాయక్ కు ఫిర్యాదు చేయడంతో వెంటనే స్పందించి వివిధ గ్రామాలకు ఇసుకను పంపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గూడెపు సుదర్శన్, సిపిఐ ఆరుట్ల లింగం, సోషల్ మీడియా కొమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెండ్

**మల్దకల్ ఆగస్టు 2(జనంసాక్షి)** జోగులాంబ గద్వాల జిల్లాలోని మల్దకల్ మండలంలోని విఠలాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి, గట్టు మండలంలోని బోయలగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిలను ఫేక్ డిఎస్ ఆర్అటెండెన్స్ నమోదు చేసినందున జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం, జిల్లాలోని ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రతి రోజు ఉదయం 11:00 గంటల లోపు తప్పనిసరిగా లైవ్ డిఎస్ఆర్ రికగ్నిషన్ యాప్‌లో నమో దు చేయవలసిందిగా ఆదేశించారు. లైవ్ డీఎస్ఆర్ నమోదు చేయకపోతే లేదా ఫేక్ డీఎస్ఆర్ నమోదు చేసినచో కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయి. కావున, జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యతతో, సమయానికి తమ విధులను నిర్వహించగలరని కోరారు.

# విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



**ఝరాసంగం, ఆగస్టు 02(జనం సాక్షి):** విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాడంతో పాటు జవాబుదారితనం పాటించేలా తయారు కావాలని స్థానిక ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచనూర్ గ్రామ శివా రులో గల కేంద్రీయ విద్యాలయంలో పాఠ శాల ప్రిన్సిపాల్ మహేష్ వాసికర్ల ఆధ్వర్యం లో నిర్వహించిన ఇన్వెస్టిచర్ కార్యక్రమానికి ఎస్ఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంపికైనా విద్యార్థి నాయకులకు ఎస్ఐ బ్యాడ్జను అలం కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చిత్తశుద్ధి, అంకిత భావం, క్రమశిక్షణతో పాఠశాల వారు ఇచ్చిన టువంటి బాధ్యతలను బాధ్యతా యుతంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రపంచానికి నైతిక, దురదృష్టి కలిగిన నాయకత్వం అవసరమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు, పోలీసు సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# 5న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లకు ఆహ్వానం

- కళాశాల ప్రిన్సిపాల్ వెల్లడి

**శివ్వంపేట ఆగస్ట్ 2 జనంసాక్షి:** శివ్వంపేట మండల పరిధిలోని గోమారం గ్రామ శివారులో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానిక్ ఇంజనీరింగ్ 30 సీట్లు, సివిల్ ఇంజనీరింగ్‌కు 20 సీట్లు ఖాళీ ఉన్నట్లు చెప్పారు. అయితే పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 5న కళాశాలకు వచ్చి కౌన్సిలింగ్‌లో పాల్గొనాలని ఆయన కోరారు.

# పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



**ఝరాసంగం, ఆగస్టు 02(జనం సాక్షి):** మండల పరిధిలోని కప్పాడ్ గ్రామంలో సాగులో ఉన్న పత్తి, పెసర పంటలను శనివారం మండల వ్యవసాయ అధికారి వెంకటేశం క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు చేశారు. ప్రత్యేకంగా నాణ్యమైన విత్తనాలతో సాగుచేస్తున్న పెసర పంటను పరిశీలించి పోతదశలో ముఖ్యంగా పోషక లోపాలు లేకుండా ఎరవానికి కిలో 19:19:19 ఎరువును వాడాలని రైతులకు సూచించారు. పంటల అధిక దిగుబడి కోసం విడతల వారిగా కాంప్లెక్స్ ఎరువులను వాడాలన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించి, నానో యూరియాను స్ప్రే చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి హరికృష్ణ, రైతులు రమేష్, నర్సింలు, కృష్ణలు ఉన్నారు.

# వాలీబాల్ పోటీల్లో మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల విజయం

**సంగారెడ్డి, ఆగస్టు2( జనం సాక్షి)** ఎంఎన్ఆర్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్ కాలేజి వాలీబాల్ క్రీడా పోటీల్లో మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలిచారు. వాలీబాల్ పోటీలలో మొహమ్మద్ కైఫ్, కిషోర్, నిఖిల్, నరేష్, వర్షిత్, రాహుల్, అఖిల్, సుహాస్,సచిన్,నేహాల్,రోహిత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాన్ని అందించారు. వారికి నిర్వాహకులు మేముంటాను అందజేశారు. డాక్టర్ మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ హైమవతి, ప్రిన్సిపాల్, బ్యూలా జానెట్, వైస్ ప్రిన్సిపాల్ అజిత్ కిరణ్, అసోసియేట్ ప్రొఫెసర్ వినోద్, లెక్చరర్ శివారెడ్డి, పీడీ పాల్గొన్నారు.



# బీటీ రోడ్డు పనులు ప్రారంభం



**చారకొండ, ఆగస్టు 2(జనంసాక్షి)** మండలంలోని చారకొండ నుండి రామపురం రోడ్డు పనులు పునఃప్రారంభం చేయడం జరిగింది. గత కొన్ని నెలలుగా ఈ రోడ్డు కాంట్రాక్టర్ రోడ్డు పనులు నిర్లక్ష్యం చేసిన కారణంగా గ్రామస్తులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణకి మొరపెట్టుకోగా తక్షణమే స్పం దించి, రోడ్డు కాంట్రాక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారు. అందుకు స్పందించిన రోడ్డు కాంట్రా క్టర్ పనులను పునఃప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండె వెంకట్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షు డు బలరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వీడిపోనిది స్నేహమొక్కటే !

**జీవితంలో మధుర జ్ఞాపకం స్నేహం**

**ఎప్పటికీ వీడిపోలేనిది మధురమైన బంధం**

**నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం**

**రాజోలి, ఆగస్టు 2 (జనంసాక్షి) :** ఆస్తులను ఆర్జించినవాడు కాదు..ఆప్తులను సంపాదించుకున్నవాడు నిజమైన అదృష్టవంతుడు. ఎవరి సమక్షంలో మన బాధలు సగం అవుతాయో..ఎవరి కారణంగా మన ఆనందం రెట్టింపు అవుతుందో వారే అసలైన స్నేహితులు. ప్రపంచమంతా నిన్ను వదిలిపెట్టి నా నీకు తోడుండేవాడే నిజమైన స్నేహితుడు. మానవ బంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడుతున్న ఈ ఆధునిక కాలంలో స్వచ్ఛమైన స్నేహం కోసం తాపత్రాయపడే వాళ్లెందరో ఉన్నారు. యాంత్రిక జీవనంతో ఉరుకులు, పరుగులతో కాలం వెళ్లదీస్తున్న చాలామందికి ఊరటనిచ్చే అంశం..ఫేస్బుక్, వాట్సాప్ లాంటి నవీన ప్రచార మాధ్యమాలతో ఆత్మీయ మిత్రుల సందేశాలే కలిమి లేముల్లో నేనున్నాను..అనే విశ్వాసం ప్రకటించే మిత్రులను సంపాదించుకున్న వాళ్లు నిజంగా ధన్యులు. తడి హృదయంతో పొడిబారని వాక్యాలతో, ఆర్ద్రత పంచేవాళ్లు..మనతోపాటు నడిచినంతమేర నవ్వులపువ్వులు పూయిం చేవాళ్లే స్నేహితులంటే..నేడు అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా మమతలు పంచే చెలిమి గురించి 'జనంసాక్షి ' ప్రత్యేక కథనం.

**మరపురాని బాంధవ్యం.!**

మనిషి పొందిన గొప్పవరం.. స్నేహం. ఈ బంధం గురించి స్ఫూర్తినిచ్చే పురాణగాథలు, నేటి కథలు ఎన్నో ఉన్నాయి. రామాయణం, మహాభారతం, భాగవతం వంటి ఇతిహాసాలతోపాటు అష్టాదశ పురాణాలు, పంచతంత్ర కథల్లో కూడా స్నేహమాధుర్యం వెల్లివిరిసింది. శ్రీకృష్ణుడు కుచేలుడు, కర్ణుడు సుయోధనుల చెలిమి స్నేహబంధం విలువను, గొప్పతనాన్ని చాటుతాయి. ప్రతి ఒక్కరి జీవన ప్రస్థానంలో స్నేహ సమీరం మనసును తాకుతోనే ఉంటుంది. జీవిత ప్రయాణంలో సేద తీర్చే చెట్టునీడలు స్నేహబంధాలు. మంచి నేస్తం ఉంటే జీవితానికి చక్కని మార్గదర్శకుడు ఉన్నట్లే.

**ఆన్లైన్ వేదికల్లో'దోస్తీ'**

కాలం మారింది. స్నేహితుల దినోత్సవం స్వరూపమూ మారుతూ వస్తోంది. ఫ్రెండ్షిప్‌డే నాడు స్నేహితులు పరస్పరం కలుసుకొని ఆత్మీయ ఆలింగనం చేసుకొని గ్రీటింగ్ కార్డులు అందించుకునే రోజులు పూర్తిగా తగ్గిపోయాయి. ఇప్పుడంతా ఆన్‌లైన్. చివరికి స్నేహభావాన్ని కూడా ఆన్‌లైన్‌లోనే పంచుకుంటున్న రోజులివి. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్, చాట్‌బాక్స్ తదితర ఆన్‌లైన్ వేదికలు స్నేహ వారధులను పెంచుతున్నాయి. కానీ ప్రమాదాలూ వాటి వెన్నంటే ఉంటున్నాయి.




# 31న పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం

**– శతాబ్ది ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బి. రవిశంకర్**




**జడ్చర్ల, ఆగస్టు 2 (జనం సాక్షి):**
బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 31న పట్టణంలోని చంద్ర గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం ఉంటుందని కమిటీ అధ్యక్షుడు బి. రవిశంకర్ వెల్లడించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నవంబర్ 27, 28, 29 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా నిర్వహించే సన్నాహక సమావేశానికి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని స్పష్టం చేశారు. 1925లో ప్రారంభమైన పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం మూడు భాషల్లో బోధన కొనసాగుతుందని, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న 3వ పాఠశాలగ అని అభిప్రాయపడ్డారు. బడి రుణం తీర్చుకునేందుకు ప్రతి పూర్వ విద్యార్థి ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉన్నారని దేశ విదేశాల్లోనూ పేరు ప్రఖ్యాతలు గాంచారని తెలిపారు. అలాంటి హై స్కూల్ శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం అందులో భాగస్వామ్యం కావడం వరమన్నారు. ప్రధానోపాధ్యాయులు చంద్రకళ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసుకుందామని అందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. సమావేశంలో శతాబ్ది ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి రమణాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. కృష్ణ, ఉపాధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం, గోపాల్, పెద్ది బాలకృష్ణ, ఆకుల వెంకటేష్, జీనురాల సత్యం, టైటాన్స్ సత్యం, శ్రీనివాస్ చారి, జయప్రకాష్, ప్రకాష్, సంతోష్ చారి, కార్యనిర్వహణ కార్యదర్శి కంచుకోట ఆనంద్, రాఘవేందర్ గౌడ్, ఉపాధ్యాయులు సునీల్ పాల్గొన్నారు.

# గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నారాయణపేట కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** నీతి ఆయోగ్ సంపూర్ణ అభియాన్ (జూలై 1 నుండి సెప్టెంబర్ 30, 2024 వరకు)లో భాగంగా నర్వ బ్లాక్ ఆరోగ్యం, పోషకాహారం, సామాజిక అభివృద్ధి ఎస్‌హెచ్‌జి రివాల్వింగ్ ఫండ్)లోని ఆరు సూచికలలో ఐదు సూచికలను సంతృప్తపరిచింది. దీని కోసం నీతి ఆయోగ్ కీలక పనితీరు సూచికల సంతృప్తత ఆధారంగా జిల్లా కలెక్టర్లకు అవార్డులను ప్రకటించింది.అందులో భాగంగా నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఐ.ఏ.ఎస్ శనివారం రాజ్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా వెండి పతకాన్ని అందుకున్నారు. సంపూర్ణత అభియాన్ సమయంలో నర్వ బ్లాక్‌లో సంతృప్తమైన సూచికలు ఇలా ఉన్నాయి. 1. ప్రసూతి సంరక్షణ నమోదులో వంద శాతం, 2..రక్తపోటు స్క్రీనింగ్ లో వంద శాతం, 3.డయాబెటిస్ స్క్రీనింగ్ లో వంద శాతం, 4. గర్భిణీ స్త్రీలకు అనుబంధ పోషకాహార ఆహారాన్ని అందించడం లో వంద శాతం, 5.స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంక్ లింకేజీని అందించడంలోనూ వంద శాతం సంతృప్తిగా ఉండటంతో అవార్డు లభించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి, గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శి, ప్రణాళిక సంఘం ప్రిన్సిపల్ కార్యదర్శి, సెర్ప్ సీఈవో పాల్గొన్నారు.

# జడ్చర్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**జడ్చర్ల, ఆగస్టు 2 (జనం సాక్షి):**
జడ్చర్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం పలికామని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధుల ద్వారా రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ (సిసి) రోడ్ పనులకు శనివారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్ పర్సన్ సారిక, కౌన్సిలర్లు జ్యోతి రెడ్డి, చైతన్య చౌహన్, ఉమాదేవి, రాజు, రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆశీర్వాదమే నా బలం

**- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి**



జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి జనంపల్లి శశికళ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆమెతో కలిసి జడ్చర్ల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన పురోహితులు అభిషేకం, ఆశీర్వచన, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాతృమూర్తి ఆరోగ్యమే తన జీవిత విజయాలకు ఆధారమని, అమ్మ ఆశీర్వాదమే నా బలం అని, తల్లిదండ్రులు మనకు భౌతిక స్వరూపంలో దేవతలని, అమ్మ ఆశీస్సులతోనే నేను ప్రజాసేవలో నిలవగలిగాను ఈ పుట్టినరోజు, ఆమెకు కృతజ్ఞతలు తెలపటానికి, దేవుని ఆశీర్వాదం తీసుకునేందుకు గొప్ప సందర్భంగా పిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు దుష్యంత్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.